క్లుప్తంగా

నేడు నీర్జాంపల్లికి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి

యల్లనూరు: మండలంలోని నీర్జాంపల్లికి శనివారం తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి రానున్నారు. ఇటీవల ఆ గ్రామానికి చెందిన వైఎస్ ఎంపీపీ–2 రంగయ్య గుండెపోటుతో మృతి చెందిన విషయం విదితమే. ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు శనివారం ఉదయం 10 గంటలకు మాజీ ఎమ్మెల్యే నీర్జాంపల్లికి రానున్నారు.

నేరాల నియంత్రణలో యువత భాగస్వామ్యం కావాలి



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి

బుక్కరాయసముద్రం: నేరాల నియంత్రణలో యువత భాగస్వామ్యం కావాలని డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, పోలీసు శాఖ సంస్మరణ వారోత్సవం పురస్కరించుకుని సైబర్ నేరాల నియంత్రణలో యువత పాత్ర అనే అంశంపై అవాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం యువతీ యువకులు ముందుకు రావాలన్నారు. సైబర్ నేరాల ఉచ్చులో పడకుండా యువత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో 14వ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, టీపీఓ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ వినీత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే గేట్‌ను ఢీకొట్టిన ఆటో

గార్లదిన్నె: మండల కేంద్రంలోని డ్యాం రోడ్డులో రైల్వేగేట్‌ను శుక్రవారం రాత్రి ఆటో ఢీకొన్న సంఘటన చోటు చేసుకుంది. వివరాలు.. గార్లదిన్నె నుంచి ఆటో మర్తాడులోకి వెళ్తుండగా అదే సమయంలో రైల్వే అధికారులు గేట్ వేసేందుకు సైరన్ మోగించారు. డ్రైవర్ వేగంగా ఆటో నడుపుకుంటూ రైల్వే గేట్ దాటే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో రైల్వే గేట్‌ను ఢీకొట్టాడు. దీంతో గేట్ విరిగి పోయింది. వెంటనే రైల్వే గేట్ సిబ్బంది తాత్కాలిక గేట్ వేశారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు.

రైతులను ఆదుకోండి



మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

గుత్తి రూరల్: వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. తుపాను వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు గుర్తించి ఎకరాకు రూ.50 వేలు పరిహారం అందజేయాలన్నారు. అదే విధంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా రూ.20వేలు వెంటనే విడుదల చేయాలన్నారు. అలాగే గతంలో మాదిరిగా బీమా ప్రీమియం సొమ్ము ప్రభుత్వమే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వరదరాజులు, నాయకులు బ్రహ్మానందరెడ్డి, సుబ్బయ్య ఆచారి, ఐటీ విభాగం నాయకులు జ్ఞానేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

న్యాక్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

గుంతకల్లు: న్యాక్ ఆధ్వర్యంలో వృత్తి పరమైన కోర్సులకు మూడు నెలలు పాటు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నయిమ్ అహ్మద్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ల్యాండ్ సర్వేయర్ శిక్షణ కోసం 18 ఏళ్ల నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కల్గి ఇంటర్ నుంచి పోస్ట్ గ్రాడుయేషన్ వరకూ చదువుకున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎలక్ట్రీషన్, ప్లంబింగ్ కోసం 18 ఏళ్ల నుంచి 35 వయస్సు కల్గి పదో తరగతి నుంచి డిగ్రీ వరకూ చదివిన అందరూ అర్హులన్నారు. స్థానిక గుత్తి రోడ్‌లోని పీడబ్ల్యూడీ కార్యాలయంలో అభ్యర్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 7013858450 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు చేస్తున్న ఆర్డీఓ, పీడీ

గుంతకల్లు: గుత్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ, ఆయా పోస్టులకు శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మూడు అంగన్‌వాడీ టీచర్లు, మరో 8 ఆయా పోస్టులకు ఆర్డీఓ ఏబీవీఎస్‌బీ శ్రీనివాస్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ఆధ్వర్యంలో ఏడుగురిని ఇంటర్వ్యూ చేశారు. అర్హత సాధించిన వారితో త్వరలోనే పోస్టులను భర్తీ చేస్తున్నట్లు వారు తెలిపారు.

కాటి కష్టాలు తీరేదెప్పుడు?

- ప్రారంభానికి నోచుకోని ఎల్‌పీజీ క్రిమిటోరియం
- పట్టించుకోని అధికారులు



ప్రారంభానికి నోచుకోని ఎల్‌పీజీ క్రిమిటోరియం

మున్సిపాలిటీ	గుంతకల్లు
వార్డులు	37
జనాభా	1,50,000

గుంతకల్లుటౌన్: ప్రాణం ఉన్నప్పుడు ఎలా బతికినా కన్నుమూశాక గౌరవంగా అంత్యక్రియలు నిర్వహించాలన్న సదుద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్టణంలో (ఎల్‌పీజీ క్రిమిటోరియం) గ్యాస్ ఆధారిత దహనవాటిక నిర్మాణానికి సంకల్పించింది. స్థానిక వాల్మీకినగర్ హిందూ శ్మశానవాటిక పక్కనున్న ఆవరణలో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.91 లక్షలతో క్రిమిటోరియం నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో రూ.50 లక్షలతో దహనవాటిక షెడ్ నిర్మాణ పనులు మున్సిపల్ ఇంజినీర్ల పర్యవేక్షణలో జరిగాయి. మిగిలిన రూ.41 లక్షలతో క్రిమిటోరియంకు అవసరమైన ఎక్విప్‌మెంట్‌ను ఏర్పాటు చేసే బాధ్యతను పబ్లిక్‌హెల్త్ వారికి అప్పగించారు. షెడ్ నిర్మాణ పనులు పూర్తి కావడంతో పాటు అవసరమైన కొంత ఎక్విప్‌మెంట్ కూడా తెప్పించి రెండున్నరేళ్లు కావస్తోంది. ఆ మిషనరీని అమర్చి క్రిమిటోరియాన్ని వినియోగంలోకి తీసుకురావడంలో మాత్రం మున్సిపల్ ఇంజినీరింగ్, పబ్లిక్‌హెల్త్ అధికారులు తాత్సారం చేస్తున్నారు.

కరోనా సమయంలో అవస్థలు

కరోనా విపత్కర సమయంలో మృతి చెందిన వారిని ఖననం చేయడానికి గుంత తవ్వాలన్నా, అంత్యక్రియలు నిర్వహించాలన్నా రూ.వేలకు వేలు డిమాండ్ చేశారు. కరోనా మహమ్మారి ఆత్మీయులను బలి తీసుకుందన్న బాధలో ఉన్న కుటుంబసభ్యుల్ని ఈ అడ్డగోలు దోపిడీ మరింత కృంగదీసింది. ఈ దోపిడీని అరికట్టడంతో పాటు మరణించిన వారికి గౌరవంగా అంత్యక్రియలు నిర్వహించాలని గత ప్రభుత్వం ఎల్‌పీజీ క్రిమిటోరియం ఏర్పాటు చేసింది. రెండు గంటల్లో దహన సంస్కారాలు పూర్తయ్యే విధంగా పనిచేయనున్న మిషనరీని కూడా తెప్పించారు. కానీ ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్ అధికారుల మధ్య కొరవడిన సమన్వయం కారణంగా క్రిమిటోరియం పూర్తయినా.. దానిని వినియోగంలోకి తీసుకోవడంలో అధికారులు విఫలమైనట్లు ప్రస్ఫుటమవుతోంది. జిల్లా అధికారులు స్పందించి క్రిమిటోరియాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

మిషనరీ అమర్చడమే మిగిలింది



ఎల్‌పీజీ క్రిమిటోరియం షెడ్, వాచ్‌మెన్ గది తదితర నిర్మాణ పనులు మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ పర్యవేక్షణలో పూర్తి చేయించాం. అవసరమైన మిషనరీ కూడా వచ్చింది. ఆ మిషనరీ కొనుగోలు, దాని అమరిక మొత్తం పబ్లిక్‌హెల్త్ అధికారులకు సంబంధం. మిషనరీ ఫిట్టింగ్స్‌ను పూర్తి చేయించి వినియోగంలోకి తీసుకొస్తాం.

– హరిక్రిష్ణ, మున్సిపల్, ఏఈ , గుంతకల్లు

దహన వాటిక వినియోగంలోకి తేవాలి



ఎల్‌పీజీ క్రిమిటోరియం త్వరగా వినియోగంలోకి తేవాలి. ఒక్క అనాథ మృతదేహాన్ని ఖననం చేసి అంత్యక్రియలు జరిపించాలంటే కనీసం రూ.5 వేలు ఖర్చవుతోంది. ఎల్‌పీజీ ఆధారిత దహనవాటికను అందుబాటులోకి తెస్తే.. ప్రజలకు ఖర్చులు తగ్గడమే కాకుండా శ్మశాన వాటికలకు స్థలం కొరత అనే సమస్య ఉండదు.

– మంజుల వెంకటేష్, ఆ నలుగురు సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు

త్వరగా ప్రారంభించాలి



ఒక మనిషి చనిపోతే అంత్యక్రియలు జరిపించడానికి శ్మశాన వాటికల్లో వేల రూపాయలు ఖర్చవుతున్నాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారుతోంది. వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఎల్‌పీజీ క్రిమిటోరియంను అధికారులు అందుబాటులోకి తెచ్చి ప్రజల ఇబ్బందులను తొలగించాలి.

– సంపత్ ఆచారి, విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు

సర్పంచుల తీర్మానం లేకుండా పనులా?



పీఆర్ జేఈతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ, సర్పంచులు

యల్లనూరు: గ్రామ పంచాయతీల్లో సర్పంచుల తీర్మానాలు లేకుండాపనులు ఎలా చేస్తారని, సర్పంచులకు విలువ లేకుండా చేస్తున్నారని అధికారులపై జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంగాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల ఇంజినీరు నరేంద్ర మాట్లాడుతూ మండలవ్యాప్తంగా రూ.1.90 లక్షలవ్యయంతో అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. అక్కడే ఉన్న జెడ్పీటీసీ మాట్లాడుతూ సర్పంచుల అనుమతి లేకుండా మీకు ఇష్టమొచ్చిన వాళ్లతో పనులు ఎలా చేయిస్తారని మండిపడ్డాడు. ఎంపీడీఓ ఆదేశాల మేరకు పనులు చేయిస్తామని పీఆర్ జేఈ సమాధానమిఇచ్చారు. సాయంత్రం వేళల్లో బస్సులను అదనంగా నడపాలని ఎంపీటీసీ తిమోతి ఆర్టీసీ అధికారులను కోరారు. అనంతరం వ్యవసాయం, విద్య, వైద్యం, హౌసింగ్, రెవిన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, ఉద్యాన, అంగన్‌వాడీ, ఐకేపీ, ఆర్టీసీ, ఆర్‌అండ్‌బీ అధికారులు ఆయా శాఖల ప్రగతిని చదివి వినిపించారు. 'సాక్షి' దిన పత్రికలో గురువారం 'వంట.. తప్పని తంటా' అన్న కథనానికి స్పందించిన ఎంఈఓ పాఠశాలల్లో వంట గదులను ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. అలాగే ఎంపీడీఓ వాసుదేవరెడ్డిని కలెక్టర్‌కు నివేదించాలని కోరారు. రెవెన్యూ సమస్యలపై ఇన్‌చార్జ్ తహసీల్దారు శేషారెడ్డి మాట్లాడారు. అంతకుముందు వైఎస్ ఎంపీపీ-2 రంగయ్య మృతిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు కాసేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో వైద్యుడు లోకేష్, హౌసింగ్ ఏఈ సుప్రజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజామణి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రవీణ్ కుమార్, ఏఓ రామకృష్ణుడు, ఏపీఓ షబ్బీర్ బాషా, ఆర్ అండ్‌బీ ఏఈ శ్రీదేవి, సొసైటీ సీఈఓ వీరనారప్ప, ఆర్టీసీ అధికారి పుల్లయ్య, హార్టీకల్చర్ సిబ్బంది మునేంద్ర, లైన్‌మెన్ ఓబులేసు, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం కలిగిఉండాలి



మాట్లాడుతున్న జేవీవీ కార్యదర్శి హరిప్రసాద్

గుత్తి రూరల్: విద్యార్థులు సేవా దృక్పథం కలిగి ఉండాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్.హరిప్రసాద్‌యాదవ్ సూచించారు. మండలంలోని రజాపురం వద్ద ఉన్న అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం శాస్త్రీయ విజ్ఞానంపై జేవీవీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహ పెంపొందించుకొని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం గాజు పెంకులు మీద నడవడం, ఆత్మ లింగాలు సృష్టించడం, నీటిని వెలిగించడం, వెలుగుతున్న కర్పూరాన్ని నోట్లో వేసుకోవడం, నాలుకకు దబ్బనం కుచ్చుకోవడం, శూన్యంలో విభూతి సృష్టించడం తదితర ప్రదర్శనలు చేసి విద్యార్థులకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ విజయ, వైస్ ప్రిన్స్‌పాల్ జ్యోతి, ఉపాధ్యాయినులు నాగ సులోచన, నాగమణి, చంద్రకళ, పుష్పలత, శశికళ, అన్నపూర్ణ, నళినికుమారి పాల్గొన్నారు.

పోలీస్ విధులపై విద్యార్థులకు అవగాహన



యల్లనూరులో అవగాహన కల్పిస్తున్న సీఐ సత్యబాబు



పుట్లూరులో మాట్లాడుతున్న ఎస్‌ఐ హేమాద్రి

యల్లనూరు: మండల కేంద్రంలో జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు పోలీసు విధులు, చట్టాలపై పుట్లూరు సీఐ సత్యబాబు అవగాహన కల్పించారు. లాకప్ గది, తుపాకీ, వాకీటాక్, ఎఫ్ఐఆర్ నమోదుపై వివరించారు. అనంతరం భవిష్యత్తులో విద్యార్థులు ఏఏ చదువులు చదువుతూ ఏఏ లక్ష్యాలను అధిగమిస్తాని అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా పోలీసు అవుతారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీరామ ప్రసాద్, కానిస్టేబుళ్లు బాలరాజు, నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుట్లూరు: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కేజీబీవీ విద్యార్థునులకు పోలీసు విధులపై ఎస్ఐ హేమాద్రి అవగాహన కల్పించారు. రిజిస్టర్లు, కేసుల నమోదు, అత్యవసర సమయంలో వాడే పరికరాలపై వివరించారు. ప్రజా రక్షణలో పోలీసుల పాత్రపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి



మాట్లాడుతున్న కుళ్లాయిస్వామి

గుంతకల్లు: రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లోని ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాయలంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పీజీ సెట్‌కు 20 నుంచి 30 శాతం మాత్రమే సీట్లు భర్తీ అయ్యాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు పీజీ సెట్‌తో సంబంధం లేకుండా యూనివర్సిటీల్లో చేరడానికి అవకాశం కల్పించాలన్నారు. ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ చేయాలన్నారు. అక్రమ మార్గంలో వైస్ చాన్స్‌లర్, రిజిస్ట్రార్, రెక్టార్లుగా ఉన్న వారిని వెంటనే తొలగించాలన్నారు. జీఓ 77ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వినోద్‌కుమార్, వెంకట్‌నాయక్, నాయకులు అఖిల్, రోహిత్, శివమణి, మల్లి, మనోజ్, పునిత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలను సమష్టిగా అభివృద్ధి చేసుకుందాం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రాచీన ఆలయాలను అభివృద్ధి చేసుకుందామని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రాచీన కట్టడాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అందులో భాగంగానే బుగ్గ రామలింగేశ్వరస్వామి, చింతల వెంకటరమణస్వామి ఆలయాలను పరిరక్షించుకుందామన్నారు. శిథిలావస్థకు చేరుకున్న ఆలయాల వివరాలను తనకు అందజేస్తే పురావస్తు శాఖ అధికారులతో చర్చించి, వాటిని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. అంతకుముందు జేసీ ప్రభాకర్‌రెడ్డి తన భార్య ఉమారెడ్డి కుమారుడు, ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డితో కలసి బుగ్గ రామలింగేశ్వరుణ్ణి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు వారికి ఘనస్వాగతం పలికారు.

కార్పొరేట్ సంపదను అందరికీ పంచాలి

గుంతకల్లు: కార్పొరేట్ సందపను ప్రజలందరికీపంచాలని అఖిల భారత యువజన సమాఖ్య మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య డిమాండ్‌చేశారు. ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభల నిర్వహణపై స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవా్రం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత దేశ సంపద ఆదాని, అంబానీ లాంటి వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయిందన్నారు. నల్ల సంపదను మొత్తం వెనక్కి తెచ్చి ప్రతి ఒక్కరి అకౌంట్లో రూ.15 లక్షలు చొప్పున జమ చేస్తామని చెప్పిన మోదీ ఒక్క రూపాయి కూడా వేయలేదన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు భృతి చెల్లించాలని, 20 లక్షల ఉద్యోగాల రూపకల్పన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్రబాబు, నక్కిలెనిన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'మా స్థలాలకు పట్టా చేయించుకున్నారు'

శింగనమల: మండలంలోని శివపురం గ్రామంలో 531 సర్వే నంబర్‌లో తలారి తిరుపాలు నుంచి స్థలం కొనుగోలు చేసి, ఇళ్లు నిర్మించుకున్నామని, కానీ ఆ ఇళ్ల స్థలాన్ని సి.బండమీదపల్లి వీఆర్‌ఏ తన కుటుంబ సభ్యుల పేరు మీద చేయించుకున్నారని శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట శివపురం గ్రామస్తులు ధర్నా చేశారు. తాము కొనుగోలు చేసుకున్న స్థలంలో ప్రభుత్వం మంజూరుచేసిన పక్కా భవనాలు నిర్మించుకున్నామన్నారు. ఆ స్థలాలను మా పేర్ల మీద నమోదు చేయాలని వారు కోరారు. అనంతరం తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నారాయణస్వామి, సన్నాగప్ప, చంద్ర, చిన్న ఎర్రప్ప, శివయ్య, నగేష్, రామాంజి, బాల నాగన్న, కిష్టయ్య, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆటోలో నుంచి కింద పడి శ్రీనివాసులు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రాయలచెరువుకు చెందిన శ్రీనివాసులు ఆటోలో వెనుక కూర్చొని గుత్తికి బయలుదేరాడు. స్పీడ్ బ్రేకర్ వద్ద ఆటోలో నుంచి అతడు జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పరామర్శ



మైనార్టీ నాయకుడు చాంద్‌బాషాను పరామర్శిస్తున్న వైస్సార్‌సీపీ నేత ఆలూరు సాంబశివారెడ్డి

యల్లనూరు: మండల కేంద్రంలోని అచ్చుకట్ల వీధిలో నివాసముంటూ ఇటీవల అనారోగ్యంతో మైనార్టీ నాయకుడు చాంద్‌బాషా తల్లి మాజీ ఉప సర్పంచు గౌస్‌బీ (75) మృతి చెందిన విషయం విదితమే. శుక్రవారం వైఎస్సార్‌సీపీ నేత ఆలూరు సాంబశివారెడ్డి తదితరులు మైనార్టీ నాయకుడు చాంద్‌బాషా, అతడి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి, కార్యకర్తలు చేటప్ప, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

28న కౌన్సిల్ సమావేశం

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఈ నెల 28న మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు తప్పకుండా సమావేశానికి హాజరు కావాలన్నారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న ఆత్మా పీడీ మద్దిలేటి

గుంతకల్లు రూరల్: పంటల సాగులో సమగ్ర సస్యరక్షణ పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఆత్మా పీడీ మద్దిలేటి సూచించారు. శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డులోని రైతు భరోసా కేంద్రంలో క్రాఫ్ లైఫ్ సిస్టమ్ అనే ఆన్‌లైన్ యాప్‌పై వ్యవసాయ శాఖ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాఫ్ లైఫ్ సిస్టమ్ ఆన్‌లైన్ యాప్ ప్రాముఖ్యత, యాప్‌ను ఏవిధంగా ఉపయోగించాలి అన్న విషయాలను పీడీ వివరించారు. అనంతరం వేరుశనగ, కంది, ఇతరత్రా పంటల్లో వచ్చే చీడపీడలు, పురుగుల కారణంగా కలిగే నష్టాలు, వాటిని గుర్తించడం వంటి అంశాలపై ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ ఆఫీసర్ స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం చాలా గొప్పది

గుత్తి: అన్నదానాల కంటే అన్నదానం గొప్పదని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప, టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ అన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం మార్కెట్ యార్డు చైర్మన్ మాజీ శ్రీనివాస యాదవ్ గర్భిణులు, బాలింతలకు భోజన సదుపాయాన్ని కల్పించారు. అంతకుముందు గర్భిణులు, బాలింతలకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చౌదరి, వేణు, బర్దివలి తదితరులు పాల్గొన్నారు.

పేకాట నిర్వాహకుడి బైండోవర్

యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు శేషారెడ్డి సమక్షంలో శుక్రవారం పేకాట నిర్వాహకుడు మారుతిని బైండోవర్ చేసినట్లు సీఐ సత్యబాబు తెలిపారు. ఈ సందర్భంగా పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ముందస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ చేశామన్నారు.

ప్రతి ఒక్కరికీ 'ఉపాధి' కల్పించాలి



మాట్లాడుతున్న పీడీ సలీం బాషా

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంతాల్లో అడిగిన వారందరికీ ఉపాధి పని కల్పించేలా చర్యలు చేపట్టాలని డ్వామా పీడీ సలీం బాషా ఆదేశించారు. శుక్రవారం మండలంలోని దండువారిపల్లిలో ఉపాధి పథకం కింద చేపట్టిన ఫారంపాండ్ పనులు, దయ్యాలకుంటపల్లిలో మినీ అమృత్ సరోవర్ పనులను పరిశీలించారు. ముందుగా రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం పీడీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఉపాధి పని కల్పించాలన్నారు. పని చేసిన కూలీలందరికీ బిల్లులు వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. జాబ్ కార్డు ఉన్న కూలీలందరూ 100 రోజులు పని పూర్తి చేసుకోవాలన్నారు. బిల్లుల చెల్లింపులో కూలీలను ఇబ్బందులు పెడితు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ పోలేరయ్య, టెక్నికల్ అసిస్టెంట్ కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆస్పత్రి అభివృద్ధిపై సమీక్ష

పెద్దవడుగూరు: ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి కమిటీ సభ్యులు తోడ్పాటు ఎంతో ముఖ్యమని డాక్టర్ శ్రీనివాసబాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించుకోవడానికి, అభివృద్ధి పనుల కోసం నిధులు విడుదలవుతాయన్నారు. ఈ సంవత్సరం రూ.87 వేలు నిధులు మంజూరయ్యాయన్నారు.ఆ నిధులను ఎలాంటి పనులకు వినియోగించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో టీడీ వె వెంకటేశ్వరమ్మ, సిబ్బంది చిట్టితల్లి తదితరులు పాల్గొన్నారు.

జూదరులపై కేసు నమోదు

పుట్లూరు: మండలకేంద్రంలో శుక్రవారం జూదం ఆడుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. ఈ సందర్భంగా ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోవడంతో పాటు రూ.1,540లు నగదు స్వాదీనం చేసుకున్నామన్నారు.

పశుగణన సద్వినియోగం చేసుకోండి

బుక్కరాయసముద్రం/గార్లదిన్నె: అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బుక్కరాయసముద్రం ఎంపీపీ సునీత, సర్పంచ్ పార్వతి సూచించారు. శుక్రవారం బీకేఎస్‌లో మండల పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ పశు గణన కార్యక్రమంలో భాగంగా ఇంటింటా సర్వే చేపట్టి పశువులు, గొర్రెలు, కోళ్లు, ఇతర పెంపుడు జంతువుల లెక్కింపు చేపడతారన్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 28 వరకూ నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గోవింద రాజులు, పశు వైద్య సహాయకులు సరస్వతి, తేజశ్వని, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గార్లదిన్నెలో పశుగణనకు సంబంధించి సామగ్రిని ఎన్యుమరేటర్లకు పశువైద్యాధికారి రమేష్ అందజేశారు. ఈ నెల 28లోపు సర్వే పూర్తిచేయాలని ఆయన సూచించారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

బుక్కరాయసముద్రం: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని సూచించారు. శుక్రవారం మండలంలోని వెంకటాపురం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అయోడిన్ కార్యక్రమం, గర్భస్థ లింగ నిర్ధారణ నియంత్రణ చట్టం, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఆడపిల్లలకు చిన్న వయస్సులో పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమన్నారు. లింగ వివక్ష నిర్మూలనలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బిల్‌కిష్ బేగం, సీహెచ్ఓ మోహన్, పర్వీన్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయించండి

గుంతకల్లుటౌన్: కసాపురం రోడ్డు బురుజు ఆంజనేయ స్వామి ఆలయ పరిసరాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయించడంతో పాటు పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని కమిషనర్ నయీమ్ అహ్మద్ సంబంధిత అధికారులకు సూచించారు. ఆలయ పరిసరాల్లో వీధి దీపాల్లేని కారణంగా అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కమిషనర్ క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. అలాగే పాతగుంతకల్లు అంకాలమ్మగుడి వీధి, రామిరెడ్డి కాలనీ, 60 అడుగుల రోడ్, కసాపురం రోడ్డు వద్ద చేపట్టిన పారిశుధ్య పనులను ఆయన తనిఖీ చేశారు.